ఇటు హర్షం.. అటు ఆందోళన

- గృహజ్యోతి కొందరికే అమలు
- సాంకేతిక కారణాలతో మరికొందరికి అమలుకాని వైనం
- సారంగాపూర్ మండలంలో ప్రతినెలా రూ. 15 లక్షల బిల్లుల మాఫీ
- లబ్ధి కోసం 4,869 కుటుంబాల ఎదురుచూపు


వినియోగదారుల మీటర్ రీడింగ్ తీస్తున్న అధికారులు (ఫైల్)

సారంగాపూర్: రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకంలో భాగంగా మార్చి నుంచి 200 యూనిట్ల లోపు విద్యుత్ బిల్లులు మాఫీ చేస్తోంది.మండలంలో పలు కుటుంబాలు ఈ పథకంలో లబ్ధి పొందుతున్నాయి. ఇదే సమయంలో కొన్ని కుటుంబాలకు ఈ పథకం వర్తించకపోవడంతో నిరాశ చెందుతున్నారు. తమకు కూడా పథకం వర్తింపజేయాలని కోరుతున్నారు.

గృహజ్యోతి పథకం..

ఇంతకుముందు 200 యూనిట్ల వరకు విద్యుత్ వాడుకున్న వినియోగదారులకు రూ. 900 వరకు విద్యుత్ బిల్లు చెల్లించాల్సి వచ్చేది. ప్రభుత్వం గృహజ్యోతి పథకం అమలు చేయడంతో ఇంటి అవసరాలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకున్న వారికి బిల్లులు మాఫీ చేస్తోంది.

మండలంలో వినియోగదారులు 6578

సారంగాపూర్ మండలంలో మొత్తం విద్యుత్ మీటర్లు 6578 ఉన్నాయి. ఇంటిలో ఎక్కువ పోర్షన్లు ఉంటే ప్రతి పోర్షన్‌కు ఒక మీటరు ఉంటుంది. ఎన్ని మీటర్లు ఉన్నా, ప్రతి తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న వారికి ఈ పథకాన్ని వర్తింపజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

వెయ్యి కుటుంబాలకు వర్తించలే..

గృహజ్యోతి కింద ఇంకా సారంగాపూర్ మండలంలో మరో వెయ్యి మందికి ఈ పథకం వర్తింపజేయాల్సి ఉంది. అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నారు..

సాంకేతిక కారణాలతో లబ్ధిపొందని కుటుంబాలు

ఒక తెల్లరేషన్‌కార్డు దారుడు ఒక మీటరు మీద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందుతాడు. వినియోగదారుడు ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులో తప్పనిసరిగా మీటరు యూనిక్ సర్వీస్ నంబర్‌ను (యూఎస్‌ఐడీ) జత చేయాలి. ఇదే విషయంలో కొంత మంది వినియోగదారులు నెంబర్‌ను తప్పుగా వేయడంతో అటువంటి వారికి ఈ పథకం వర్తించలేదు. దీనితో ప్రతి నెల మండలపరిషత్ కార్యాలయంలో దీని కోసం ఒక ప్రత్యేక కౌంటరును ఏర్పాటు చేసి అమలు కాని వారి నుండి దరఖాస్తులు స్వీకరించి యూనిక్ సర్వీస్ నంబర్, తెల్లరేషన్ కార్డు నెంబరు, ఆధార్ నంబర్‌తో తిరిగి ఆన్‌లైన్ చేయడంతో సమస్య కొంత పరిష్కారమవుతోంది. మండలంలోని 18 గ్రామాల్లో ఈ పథకం కింద ఏప్రిల్ నెలలో 4,869 మంది గృహమీటర్ల మీద రూ. 15,02,270 లబ్ధి జరిగింది. ఇంతవరకు లబ్ధి పొందని వారి వెంటనే తమకు గృహజ్యోతి పథకం వర్తింపజేయాలని కోరుతున్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఈ పథకం అందుతుందని, ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత జూన్ నెలలో ఈ పథకం అర్హులైన అందరికి అందజేస్తామని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

రెండు సార్లు దరఖాస్తు చేసుకున్న



గృహజ్యోతి కింద లబ్ధిపొందడానికి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాను, సాంకేతిక కారణాలతో రాలేదని అధికారులు చెప్పడంతో రెండోసారి దరఖాస్తు చేసుకున్నా. ఈ నెలలో కూడ ఈ పథకం వర్తింపబడలేదు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– ఏలేటి మల్లారెడ్డి, సారంగాపూర్

బిల్లు ఎక్కువగా వస్తోంది



సారు నా ఇంటిలో రెండు బల్బులు, రెండు ఫ్యానులు ఉన్నాయి. బిల్లు ఫ్రీ అయితది అనుకున్నా, కాని కాలేదు. సార్లు చెబితే రెండు సార్లు దరఖాస్తు ఇచ్చినా, ఇంతవరకు కాలేదు. సారు నాకు ఈ పథకం కింద బిల్లు రాకుండా సూడాలి.

– కూసాడి పోచవ్వ, గణెగుట్ట, పోతారం

క్లుప్తంగా

పోలింగ్ బూత్‌ల పరిశీలన


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అధికారి

ఇబ్రహీంపట్నం: మండలంలోని అమ్మక్కపేట, డబ్బా, వర్షకొండ, కోమటికొండాపూర్, ఎర్దండి గ్రామాల్లోని 12 పోలింగ్ బూత్‌లను శుక్రవారం ఎన్నికల సెక్టోరియల్ అధికారి దీపిక పరిశీలించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ బూత్‌లలో విద్యుత్, ఫ్యాన్లు, ఫర్నిచర్, మరుగుదొడ్లు, వికలాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ర్యాంపులను పరిశీలించారు. పోలింగ్ బూత్‌లలో అన్ని వసతులు ఉన్నట్లు ఆమె గుర్తించారు. ఆమె వెంట అధికారులు ఉన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి

జగిత్యాలఅగ్రికల్చర్: పంట పొలాల్లో రైతులు సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని కోరమాండల్ జగిత్యాల మార్కెటింగ్ మేనేజర్ సురేశ్ కోరారు. సారంగాపూర్ మండలంలోని పెంబట్లలో శుక్రవారం రైతులకు ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహించి ఫలితాల కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులను వీలైనంతగా తగ్గించి సేంద్రియ ఎరువులను అధికంగా వేయాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ అగ్రానమిస్ట్ పృథ్వీ, మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు సంపత్, అనూక్, మహేశ్, రైతులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

జగిత్యాలటౌన్: రేకుర్తి కంటి ఆస్పత్రి,లయన్స్ క్లబ్ జగిత్యాల ఆధ్వర్యంలో శుక్రవారం జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ పురాతన పాఠశాలలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి శుక్లాలతో బాధపడుతున్న 200 మంది రోగులను పరీక్షించిన వైద్య సిబ్బంది 96 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించి రేకుర్తి కంటి ఆస్పత్రికి పంపించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జగిత్యాల అధ్యక్షుడు తాటిపాముల వినోద్‌కుమార్, వద్దగడ్డ శంకర్, గుండేటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జగిత్యాల: విద్యార్థులు ప్రతి పోటీల్లో పాల్గొంటూ అన్ని రంగాల్లో రాణించాలని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. శుక్రవారం రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ కళాశాలకు చెందిన విద్యార్థులకు జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్ కార్యక్రమం నిర్వహించగా జగిత్యాల కళాశాలకు చెందినవిద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే నిర్వహించే ఈ కార్యక్రమంలో జగిత్యాలకు చెందిన విద్యార్థులు సందీప్, రఘు, ప్రణయ్, ఉపేందర్, ఉదయ్‌లు జిజ్ఞాస ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ప్రతిభ కనబర్చడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ


వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ రఘుచందర్

వెల్గటూర్: మండలంలోని కిషన్‌రావుపేటలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ రఘుచందర్ శుక్రవారం విచారణ చేపట్టారు. కిషన్‌రావుపేటకు చెందిన అన్నపూర్ణ తనను కులం పేరుతో దూషించిందని ఇదే గ్రామానికి చెందిన మేరుగు కొమురయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. అట్రా సిటీ కేసు నమోదవడంతో సాక్షులతో మా ట్లాడి, వివరాలు సేకరించినట్లు తెలిపారు. సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉమాసాగర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

మల్లాపూర్: మండలంలోని వాల్గొండలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌పై శుక్రవారం రాత్రి ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. బెల్ట్‌షాప్ నిర్వాహకుడి వద్ద రూ.11,730ల విలువ గల 40.08 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని బెల్ట్‌షాప్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


షాపింగ్‌మాల్‌లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జగిత్యాలక్రైం: అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి మధు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని షాపింగ్‌మాల్స్, సినిమా థియేటర్లలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాలు, పట్టణాల్లో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు తక్షణమే స్పందించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలన్నారు. దీంతో స్థానికంగా ఉన్న వారు అగ్నిప్రమాదాన్ని నివారించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రవీందర్, ప్రశాంత్, మల్లేశం, నరేశ్, వేణు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

మెట్‌పల్లి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మెట్‌పల్లి పట్టణంలో అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శుక్రవారం పలు సినిమా థియేటర్లు, షాపింగ్ మాళ్లలలో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకునే జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి అగ్నిమాపక కేంద్ర అధికారి మల్లికార్జున్, సిబ్బంది వహిదుల్లాఖాన్, అంజనేయులు,అమర్‌సింగ్, సంతోష్,భాస్కర్,మహర్షి తదితరులు పాల్గొన్నారు.

'అందరి మద్దతు జీవనన్నకే'


ఇంటింటా ప్రచారం చేస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాలటౌన్: ఏ గడపకెళ్లినా జీవనన్నకే ప్రజలు మద్దతు తెలుపుతున్నారని జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని 21వ వార్డులో కాంగ్రెస్ నాయకులతో కలిసి జీవన్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. బీడీ కార్మికుల శ్రమ దోపిడీ కాకుండా వెయ్యి బీడీలకు 230 ఉన్న మంజూరీని 300లకు పెంచేందుకు జీవనన్న చొరవ తీసుకున్నారన్నారు. జిల్లా కేంద్రంలో పీఎఫ్ ఆఫీస్ ఏర్పాటు, ఈఎస్‌ఐ ఆస్పత్రితో పాటు పాస్‌పోర్టు సేవాకేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం



మల్లాపూర్: దేశ ప్రజలు ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ పార్టీని విశ్వసిస్తున్నారని, ప్రజల ఆశీస్సులతో కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముత్యంపేటలో శుక్రవారం నిర్వహించిన బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడారు.బీజేపీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని, ఎంపీగా అరవింద్‌ను భారీ మెజార్టీతో గెలుపించుకోవాలని కోరారు. అనంతరం బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా వాకిటి తిరుపతిరెడ్డికి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణంలో ఇంటింటా బీజేపీ ప్రచారం

కోరుట్ల: పట్టణంలోని 31వ వార్డులో కౌన్సిలర్ పెండెం గణేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం బీజేపీ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన పథకాలను వివరిస్తూ నిజామాబాద్ ఎంపీగా మరోసారి ధర్మపురి అరవింద్‌ను గెలిపించాలని కోరారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని టౌన్–2 పరిధిలో పాతబస్టాండ్, విద్యానగర్, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల రోడ్, రాజీవ్‌చౌక్, ధర్మపురి బైపాస్‌రోడ్, గాయత్రి దేవాలయం, తాతమ్మగుడి ప్రాంతం, విజయపురి, దయాల్‌నగర్, బైపాస్‌రోడ్, సీతారాంనగర్ కాలనీల్లో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టౌన్–2 పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు.

మల్యాల: మండలంలోని తాటిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అసిస్టెంట్ ఇంజనీర్ తెలిపారు.

నేడు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి గల రైతులు రూ 100 చెల్లించి, తమ పేరును రిజిష్టర్ చేసుకుని, సకాలంలో శిక్షణ హాజరు కావాలని రైతు గడ్డం సత్యనారాయణ రెడ్డి తెలిపారు.

కోటిలింగాల ఆలయంలో టెండర్ల ఆహ్వానం

వెల్గటూర్ : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కోటిలింగాల కోటేశ్వరస్వామి ఆలయంలో 2024–25 సంవత్సర బహిరంగ వేలం కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి తెలిపారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రికి రూ.3 లక్షలు, కొబ్బరికాయలు పోగు చేసుకొనుటకు రూ.30 వేలు డిపాజిట్ చెల్లించి ఈ నెల 22న ఆలయ ప్రాంగణంలో నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనాలని ఈవో పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

జగిత్యాలరూరల్: జగిత్యాల ఓల్డ్ హైస్కూల్‌లో ఈనెల 14న జరిగిన జిల్లాస్థాయి జూనియర్స్ బాస్కెట్ బాల్ ఎంపిక పోటీల్లో అంతర్గాం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన అల్లెపు పూజ, తునికి కీర్తన, మడత రాహుల్ సత్తాచాటి రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు పీఈటీ అజయ్‌బాబు తెలిపారు. ఈనెల 25 నుంచి 27 వరకు డీపీఎస్ హైదరాబాద్‌లో జరిగే జూనియర్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం సత్తయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ శివారులో నూతనంగా నిర్మించే గంగమ్మ ఆలయానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ సురేశ్ గౌడ్, బీజేపీ సీనియర్ నాయకుడు గుగ్గిళ్ల తుక్కారాంగౌడ్, ముక్కెర లింబాద్రి,గంగపుత్ర సంఘ నాయకులు పాల్గొన్నారు.

సెట్‌బ్యాక్ లేని నిర్మాణంపై ఫిర్యాదు

రాయికల్: పట్టణంలోని కుబేర బుక్ సెల్లార్ పక్క వీధిలో సెట్‌బ్యాక్ లేకుండా భవనం నిర్మిస్తున్నారని 12వ వార్డుకు చెందిన కాలనీవాసులు శుక్రవారం కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. సెట్‌బ్యాక్ లేకపోవడంతో దారిలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజారాం తండాలో డీపీవో పర్యటన


తండాలో పరిశీలిస్తున్న అధికారులు

కథలాపూర్: మండలంలోని రాజారాం తండాలో డీపీవో దేవరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సతీశ్ శుక్రవారం పర్యటించారు. ఈనెల 19న సాక్షి దినపత్రికలో 'రాజారాం తండాలో మంచినీళ్లకు గోస గోస' అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు రాజారాం తండాలో పర్యటించారు. గ్రామస్తులను నీటి సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. అద్దెకు బోరుబావి తీసుకుని ట్యాంకులో నీరు నింపాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. డీపీవో వెంట ఎంపీడీవో శంకర్, ఎంపీవో ప్రవీణ్, ఏఈ చంద్రశేఖర్ ఉన్నారు.

సాక్షి స్పందన

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి


ధాన్యం పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో రఘువరన్

ఇబ్రహీంపట్నం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల కోసం వసతులు కల్పించాలని జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి రఘువరన్ అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం, వర్షకొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి ప్లెక్సీలు పెట్టారా, రైతులకు నీడ కోసం టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర వసతులను పరిశీలించారు. ధాన్యంను తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించిన తర్వాతనే కొనుగోలు చేపట్టి తూకం వేయాలని, ధాన్యం కొన్న వెంటనే వెంటనే లారీల్లో మిల్లులకు తరలించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దీపిక, ఎంపీవో కృపాకర్, ఏఈవో నరేశ్, సొసైటీ సీఈవో త్రి సతీష్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన

రాయికల్: మండలంలోని అల్లీపూర్, ఆల్యానాయక్ గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లను శుక్రవారం డీఆర్డీవో సంపత్‌రావు పరిశీలించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో చిరంజీవి, ఏపీఎం చక్రవర్తి ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో అధికారుల తనిఖీ

మేడిపల్లి: మండలంలోని పోరుమల్ల, కట్లకుంట, మేడిపల్లి గ్రామల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ డీఆర్‌డీవో చరణ దాస్, డీపీఎం మల్లేశం తనిఖీ చేశారు. ధాన్యం కోనుగోళ్ల వివరాలు, సెంటర్లలోని వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. వారి వెంట ఏపీఎం అశోక్ ఉన్నారు.

పెరుక సంఘం ఫంక్షన్ హాల్ ప్రారంభం

మేడిపల్లి: మండలంలోని వల్లంపల్లిలో నిర్మించిన పురిగిరి క్షత్రియ పెరుక సంఘం ఫంక్షన్ హాల్ ను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఫంక్షన్ హాల్ అభివృద్ధికి సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో రమేశ్ రెడ్డి, నరేశ్ రెడ్డి, సాయిని గంగారెడ్డి, శ్రీపతి దామోదర్, చెక్కపెల్లి శంఖర్, యుసుఫ్ తదితరులు పాల్గొన్నారు

ఓటుహక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన

కోరుట్ల: పట్టణంలోని బీఈడీ కళాశాలలో ఓటు హక్కు వినియోగంపై మున్సిపల్ అధికారులు విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలని, ఒత్తిళ్లకు, ప్రలోభాలకు లొంగి ఓటును దుర్వినియోగం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు భారీగా తరలిరావాలి

సారంగాపూర్: నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఈ నెల 22న నామినేషన్ వేయనున్నారని, కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలిరావాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. మండలంలోని రేచపల్లిలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం, నామినేషన్‌కు జనం తరలింపుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రేచపల్లి, లచ్చనాయక్‌తండా, భీంరెడ్డిగూడెం, మ్యాడారంతండా నుంచి నామినేషన్‌కు జనం తరలింపుపై చర్చించారు. సమావేశంలో రాంచంద్రారెడ్డి, ఇబ్రహీం, శైలేందర్‌రెడ్డి, ప్రసాద్, అనందరెడ్డి, లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి, అసాది రాజం, నర్సింహ్మారెడ్డి, హరీష్, మహేష్, శంకర్, సత్తెన్న, రాజిరెడ్డి, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెగడపల్లి: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పెగడపల్లి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. సుల్తానాబాద్ మండలం గట్టపల్లి గ్రామానికి చెందిన ఎండీ లియాకత్ అలీ, ఎండీ ఖలీల్, ఎండీ నవీద్, ఎండీ అమీర్, ఎండీ అమ్జద్, అనే వ్యక్తులు ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పెగడపల్లి శివారులో శుక్రవారం తెల్లవారు జామున పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా దీనిపై ఫిర్యాదు చేయవచ్చని ఎస్సై పేర్కొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే

జగిత్యాలక్రైం: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకెళ్లడం తప్పదని రూరల్ ఎస్సై సదాకర్ అన్నారు. శుక్రవారం నర్సింగాపూర్ బైపాస్‌రోడ్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. వాహనదారులు డ్రైవింగ్‌లైసెన్స్‌తో పాటు, వాహనానికి ఇన్సూరెన్స్ ఉండేలా చూసుకోవాలన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన వెదురు బొంగులు స్వాధీనం

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి శివారుల్లోని ఎస్సారెస్పీ కాలువలో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నిలువ ఉంచిన వెదురు బొంగులను శుక్రవారం అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు సమీపంలోని అటవీప్రాంతంలో వెదురు బొంగులను నరికి ఎస్సారెస్పీ కాలువలో తరలించడానికి నిలువ ఉంచారు. ఇటీవల ఎస్సారెస్పీ కాలువ వైపు వెళ్లిన గ్రామస్తులు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. స్వాధీనం చేసుకున్న వెదురు బొంగులను అటవీశాఖ కల్లెడ డిపోకు తరలించినట్లు ఇన్‌చార్జి సెక్షన్ అధికారి హమీద్, బీట్ అధికారి కిరణ్ తెలిపారు. వారి వెంట బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

హనుమాన్ దీక్షాపరులకు ముస్లిం అల్పాహారం

జగిత్యాలరూరల్: హనుమాన్ దీక్షాపరులకు ముస్లిం సోదరులు అల్పాహార విందు ఏర్పాటు చేసి తమ మతసామరస్యాన్ని చాటుకున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన నదీమ్, జాహిద్ శుక్రవారం రాత్రి లక్ష్మీపూర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో 60 మంది హనుమాన్ దీక్షాపరులకు అల్పాహార విందు ఏర్పాటు చేసి తమ భక్తిని చాటుకున్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

కోరుట్ల రూరల్: మండలంలోని సర్పరాజ్ పూర్‌లో విద్యుత్ షాక్‌తో పాడి గేదె శుక్రవారం మృతి చెందింది. స్థానికులవివరాల ప్రకారం రైతు కొక్కు గణేష్‌కు చెందిన గేదె మేత కోసం వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వి ద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. గేదె విలువ రూ. 75 వేలు ఉంటుందని రైతు గణేష్ తెలిపారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు.

కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించాలి

మల్యాల: కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్ఠు నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది అనుమానితులను పరీక్షించగా ఒకరికి నిర్ధారణ అయింది. కుష్ఠు వ్యాధిని ప్రారంభం లోనే గుర్తించి, చికిత్స ప్రారంభించాలని, నిర్లక్ష్యం చేస్తే అంగవైకల్యం వచ్చే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. డాక్టర్ మౌనిక, సీహెచ్‌వో లక్ష్మి, డీపీఎంవో దేవీసింగ్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలివెళ్లిన బీఆర్‌ఎస్ నాయకులు

జగిత్యాల: నిజామాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం నామినేషన్ వేసిన సందర్భంగా జగిత్యాల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పనిచేయని చేతిపంపు..!


ఆత్మకూర్ సర్కంపేటలో పనిచేయని చేతిపంపు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌లోని సర్కంపేటలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతంలో చేతిపంపు ఉన్నప్పటికీ అది పనిచేయడంలేదు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కారించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మరోవైపు వినియోగంలో లేకపోవడంతో చేతిపంపు వద్ద పిచ్చి మొక్కలు పెరిగాయి. చేతిపంపుకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువస్తే నీటి తిప్పలు తగ్గనున్నాయి.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, వధువు వివరముల శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా:
9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
జగిత్యాల : రాజమల్లేశ్ - 9392460005
ధర్మపురి : వెంకటేష్ - 8008019205
కోరుట్ల : సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం: 1800 425 9899